## రుణయాప్ నిర్వాహకుల వేధింపులకు విద్యార్థి బలి

- కృష్ణానదిలో దూకి ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ) : రుణయాప్ నిర్వాహకుల వేధింపులకు మరో విద్యార్థి బలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన మురికింటి వంశీ (22) ఇంజినీరింగ్ ఫైనలియర్ చదువుతున్నాడు. ఇటీవల రుణ యాప్ నుంచి రూ.10 వేలు తీసుకోగా.. రూ. లక్ష కట్టాలని నిర్వాహకుల నుంచి ఒత్తిళ్లు మొదలయ్యాయి. తల్లిదండ్రులకు తెలిస్తే బాధపడుతారన్న భయంతో ఈ నెల 25న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తాను చనిపోతున్నానంటూ మెసేజ్ పంపి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి తాడేపల్లి వద్ద కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వంశీ కోసం రెండు రోజులుగా కుటుంబ సభ్యుల గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు తాడేపల్లిలో కృష్ణా నది వద్ద సోమవారం సెల్‌ఫోన్, చెప్పులు, బైక్ గుర్తించారు. నదిలో గాలించి వంశీ మృతదేహాన్ని బయటకు తీసి, కేసు దర్యాప్తు చేపట్టారు.

## డబ్బుల్లేక మృతదేహాన్ని రోడ్డుపై వదిలేశాడు!

ఇండోర్, మే 27: అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన ఓ వ్యక్తి తనతో సహజీవనం చేస్తున్న మహిళ మృతదేహాన్ని రోడ్డుపై వదిలేశాడు. ఆదివారం ఈ ఘటన జరిగిందని పోలీసులు వెల్లడించారు. 'మహిళ శరీరంపై ఎలాంటి గాయాలు కనిపించలేదు. దీర్ఘ కాలిక కాలేయ సంబంధ వ్యాధులతో ఆమె సహజ మరణం పొందినట్టు శవ పరీక్షలో తేలింది' అని ఏసీపీ నందిని శర్మ తెలిపారు. మహిళ శవాన్ని గోనె సంచిలో ఉంచి రోడ్డుపై వదిలేసిన అనంతరం ఆమెతో సహ జీవనం చేసిన వ్యక్తి ఓ ఉద్యానవనంలో సంచరిస్తూ కనిపించాడని.. అతడి మానసిక స్థితి సరిగా లేనట్టు గుర్తించామని పోలీసులు తెలిపారు. మూడు రోజుల నుంచి దుర్వాసన వస్తున్నదని ఇరుగు పొరుగువారు ఫిర్యాదు చేసినా అతడు పట్టించుకోలేదని వారు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

## నేడు హైదరాబాద్‌లో దక్షిణ భారత్ ఉత్సవ్

హైదరాబాద్, మే 27(నమస్తే తెలంగాణ: దక్షిణాది రాష్ట్రాల్లో పర్యాటకరంగం అభివృద్ధికి ఉన్న అవకాశాలను వివరించేందుకు ఫెడరేషన్ ఆఫ్ కర్నాటక చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌కేసీసీఐ) ఆధ్వర్యంలో జూన్ 15, 16వ తేదీల్లో బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లో దక్షిణ భారత్ ఉత్సవ్-2024ను ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ సహకారంతో ఈ నెల 28న హైదరాబాద్ ఆబిడ్స్‌లోని రాయల్టన్ హోటల్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేయడంతోపాటు రోడ్ షో నిర్వహిస్తున్నారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

## తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ఆందోళన

కోనరావుపేట, మే 27 : రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలోని 8వ వార్డులో తాగునీరు రావడం లేదని మహిళలు ఖాళీ బిందెలతో సోమవారం ఆందోళనకు దిగారు. వారం రోజులుగా నల్లా నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్తే ఒక్క రోజు మాత్రమే వాటర్ ట్యాంకర్ ద్వారా నీరందించినట్టు పేర్కొన్నారు.

## అంటార్కిటికా నుంచి వేరుపడ్డ భారీ మంచుకొండ

- ఢిల్లీ నగర వైశాల్యంతో పోల్చితే నాలుగు రెట్లు ఎక్కువ

న్యూఢిల్లీ, మే 27: అంటార్కిటికాలో దాదాపు 380 చదరపు కిలోమీటర్ల వైశాల్యమున్న భారీ మంచుకొండకు పగుళ్లు ఏర్పడి రెండుగా చీలిపోయింది. ఢిల్లీ నగర వైశాల్యంతో పోల్చితే నాలుగు రెట్లు ఉండే ఈ మంచుకొండను సైంటిస్టులు ఏ-83గా పేర్కొంటున్నారు. మే 20న చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి 'కకోపర్నికస్ సెంటినల్-1' శాటిలైట్ ఫొటోలు విడుదల చేసింది. త్రిభుజాకారంలో ఉన్న ఏ-83 మంచుకొండ మే 22నాటికి పూర్తిగా చీలిపోయినట్టు శాటిలైట్ విడుదల చేసిన రాడార్ చిత్రాలు చెబుతున్నాయి. అంటార్కిటికాలోని ఈ ప్రాంతంలో భారీ మంచుకొండలకు పగుళ్లు రావటం గత నాలుగేండ్లలో ఇది మూడోసారి. 'మెక్‌డొనాల్డ్ ఐస్ రంపెల్స్'గా పిలుస్తున్న ప్రాంతంలో మంచు కరగటమే ఈ పరిణామానికి కారణమని సైంటిస్టులు భావిస్తున్నారు. అంటార్కిటికాలో వస్తున్న వాతావరణ మార్పులపై ఆందోళన వ్యక్తమవుతున్నది.

# ఫీజు బకాయిలు 7 వేల కోట్లు

## ప్రహసనంగా ఫీజు రీయింబర్స్‌మెంట్

- డిగ్రీ, పీజీ కాలేజీలకే ఏడాదికి 750కోట్లు
- మూడేండ్లుగా నిలిచిపోయిన చెల్లింపులు
- సర్టిఫికెట్లు ఇచ్చేందుకు యాజమాన్యాలు నో
- ఉన్నతవిద్యకు పేద విద్యార్థులు దూరం




హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాల బకాయిలు కొండలా పేరుకుపోయాయి. దాదాపు రూ. 7 వేల కోట్ల బకాయిలు ఉండడంతో ఇటు విద్యార్థులు, అటు కాలేజీ యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఫీజు చెల్లించకపోవడంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు కాలేజీ యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయి. దీంతో ఎంతోమంది పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీతోపాటు, వృత్తి విద్యాకోర్సులను అభ్యసించే నిరుపేద ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు చెల్లిస్తున్నది. ప్రస్తుతం అందుకు సంబంధించిన నిధుల విడుదల పూర్తిగా నిలిచిపోయింది. ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ , స్కాలర్‌షిప్‌లను వాయిదాల పద్ధతిలో చెల్లిస్తారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో 25 శాతం, మధ్యలో 50శాతం, చివర్లో మిగతా 25 శాతం చెల్లిస్తారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఈ విధానాన్ని పాటించడం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ. 5,500 కోట్లకు పైగా బకాయి పడగా, ఉపకారవేతనాలు కూడా కలుపుకొంటే దాదాపు రూ. 7 వేల కోట్లకు పైగా ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉంది.

### విద్యార్థుల అవస్థలు

ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఏటా 10లక్షల మందికిపైగా విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేయకపోవడంతో వీరంతా ఆందోళనకు గురవుతున్నారు. ఫీజు చెల్లించని కారణంగా ప్రైవేటు యాజమాన్యాలు పరీక్షలు రాయనివ్వడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొందరు అప్పులు చేసి ఫీజు చెల్లిస్తుండగా, ఆ స్థోమత కూడా లేని వారు మధ్యలోనే చదువుకు స్వస్తి చెప్తున్నారు. రీయింబర్స్‌మెంట్ చెల్లించకుంటే కాలేజీలు నడిపేదెలా అని యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి.

### విన్నవించినా స్పందించని సర్కారు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఇటు విద్యార్థి సంఘాలు, అటు కాలేజీ యాజమాన్యాలు ఎప్పటికప్పుడు విజ్ఞప్తి చేస్తున్నా సర్కారు స్పందించడం లేదు. నిధులు విడుదల చేయకపోవడంతో నిరుపేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే నిధులను విడుదల చేయాలని అసెంబ్లీ వేదికగా ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినా చలనం లేకుండా పోయింది. ఇటీవల పలు విద్యార్థి సంఘాలు, కులసంఘాల నేతలు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు సైతం ప్రభుత్వానికి, మంత్రులకు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## జూలై 1 నుంచి కొత్త క్రిమినల్ చట్టాలు

- న్యాయ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం
- నల్సార్ వీసీ శ్రీకృష్ణదేవరావు వెల్లడి
- రాజద్రోహం.. ఇకపై దేశద్రోహం
- చిన్న నేరాలకు శిక్షగా సమాజసేవ

హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ): న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా బాధితులకు సత్వర న్యాయాన్ని అందించేందుకు జూలై 1 నుంచి దేశంలో 3 కొత్త క్రిమినల్ చట్టాలు అమల్లోకి రానున్నాయని నల్సార్ వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు వెల్లడించారు. ఆయా చట్టాలపై సోమవారం సమాచార కార్యాలయంలో పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ అధ్యక్షతన నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. బ్రిటిషర్ల హయాంలో చేసిన భారత శిక్షా స్మృతి-1860 (ఐపీసీ), క్రిమినల్ ప్రొసిజర్ కోడ్-1973 (సీఆర్పీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్-1872 స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం చట్టాలను అమలు చేయనున్నట్టు తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త క్రిమినల్ చట్టాలను రూపొందించారని, ఇవి శిక్ష కంటే న్యాయంపై ఎక్కువగా దృష్టి సారిస్తాయని, అసమంజసమైన వాయిదాలను అరికట్టడం ద్వారా బాధితులకు సత్వర న్యాయాన్ని అందించేందుకు కాలపరిమితిని నిర్ణయిస్తాయని వివరించారు. మాజీ ఐజీ దామోదర్ మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచేందుకు కొత్త క్రిమినల్ చట్టాలు దోహదపడతాయని, వీటిపై అందరూ అవగాహన పెంచుకోవాలని అన్నారు. కొత్త క్రిమినల్ చట్టాల్లో చేసిన మార్పుల గురించి సీడీటీఐ డైరెక్టర్ ఎన్ రాజశేఖర్ వివరించారు. మహిళలు, పిల్లల హక్కుల పరిరక్షణ కోసం న్యాయ వ్యవస్థలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించనున్నట్టు తెలిపారు. రాజద్రోహాన్ని దేశద్రోహంగా మార్చారని, చిన్న నేరాలకు పాల్పడినవారికి సమాజ సేవను శిక్షగా విధించనున్నారని, ఆర్థిక, సైబర్ నేరాలను వ్యవస్థీకృత నేరాలుగా వర్గీకరించారని వెల్లడించారు.





## హరిత చెట్లను అడ్డంగా నరికేశారు..

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని ప్రధాన రహదారిలో హరితహారం చెట్లను సోమవారం నరికేశారు. ఐదేండ్ల క్రితం నాటిన మొక్కలు ఏపుగా పెరిగి దారివెంట వెళ్లేవారికి నీడనిస్తుండగా, విద్యుత్తు తీగలకు తగులుతున్నాయంటూ సిబ్బంది ఏకంగా ఆ చెట్లనే నరికేశారు. అలాగే మసీదు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం అడ్డుగా ఉన్న చెట్లను కొట్టివేశారు. లక్షలు వెచ్చించి పెంచిన చెట్లను కొట్టివేయడంపై ప్రకృతి ప్రేమికులు మండిపడుతున్నారు. చెట్ల నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. - నార్నూర్

వాణిజ్య

## సామ్‌సంగ్ సరికొత్త గెలాక్సీ ఫోన్లు

### ప్రారంభ ధర రూ.26,999

న్యూఢిల్లీ, మే 27: సరికొత్త స్మార్ట్‌ఫోన్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది సామ్‌సంగ్ సంస్థ. గెలాక్సీ సిరీస్‌లో భాగంగా విడుదల చేసిన ఎఫ్55 5జీ వ్యాగన్ లెదర్ డిజైన్, 6.7 ఇంచుల ఫుల్ హెచ్‌డీ+ సూపర్ అమోలెడ్ డిస్‌ప్లే, శక్తివంతమైన స్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్‌తో ఈ మొబైల్‌ను తీర్చిదిద్దింది. 8జీబీ+128జీబీ మెమొరీ కలిగిన మాడల్ ధర రూ.26,999 కాగా, 8జీబీ+256 జీబీ మాడల్ రూ.29,999, అలాగే 12జీబీ+256 జీబీ మాడల్ రూ.32,999గా నిర్ణయించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ కార్డులపై కొనుగోలు చేసిన వారికి రూ.2 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ కల్పిస్తున్నది. 45 వాట్ల సూపర్-ఫాస్ట్ చార్జింగ్, ఆండ్రాయిడ్ అప్‌గ్రేడ్, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా సామ్‌సంగ్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజు పుల్లన్ మాట్లాడుతూ..దేశం కోసం దేశీయంగా తయారైన ఈ ఎఫ్55 5జీ స్మార్ట్‌ఫోన్ కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగా, ముఖ్యంగా యువతను దృష్టిలో పెట్టుకొని డిజైన్ చేసినట్లు చెప్పారు.






# 4 నెలలు.. 1,762 కోట్లు

## రకరకాల ట్రేడింగ్ స్కాముల్లో పెద్ద ఎత్తున మోసపోతున్న మదుపరులు

**ఈ ఏడాది జనవరి-ఏప్రిల్‌లో సైబర్‌క్రైమ్‌లు**

| కేసులు | నేరం | నష్టం (రూ.కోట్లలో) |
|---|---|---|
| 20,043 | ట్రేడింగ్ కుంభకోణాలు | 1,420 |
| 62,687 | పెట్టుబడి స్కాములు | 222 |
| 4,599 | డిజిటల్ మోసాలు | 120 |

ముంబై, మే 27: అమాయకులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు మోసాలకు తెగబడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు నమోదైన వివిధ సైబర్‌క్రైమ్ కేసుల్లో ఇన్వెస్టర్లు రూ.1,762 కోట్లు నష్టపోయినట్టు ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (14సీ) వివరాలు చెప్తున్నాయి. ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ మోసం, గేమింగ్ యాప్స్, అల్గరిథమ్ అక్రమాలు, చట్టవిరుద్ధమైన రుణ యాప్‌లు, ఓటీపీలను ఇతరులకు పంపడం వంటి వాటిల్లో బాధితులు ఎక్కువగా ఉన్నట్టు తేలింది. తాజాగా నవీ ముంబైలోని ఖర్ఘర్ టౌన్‌షిప్‌కు చెందిన ఓ 48 ఏండ్ల వ్యక్తి కూడా షేర్ ట్రేడింగ్ కుంభకోణంలో చిక్కుకుని రూ.1.07 కోట్లు మోసపోయాడు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, పోలీసులు 15 మందిపై 420సహా వివిధ సెక్షన్ల కింద ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. వీరిలో ఓ యాప్, వెబ్‌సైట్ ఓనర్లు కూడా ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి మే 5 వరకు బాధితుడిని మోసగాళ్లు పలుమార్లు కలిశారని, షేర్ ట్రేడింగ్ నుంచి ఆకర్షణీయమైన లాభాలను ఇప్పిస్తామని నమ్మబలికారని నవీ ముంబై సైబర్ పోలీస్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ గజానన్ కదమ్ తెలిపారు. ఈ క్రమంలోనే వివిధ బ్యాంక్ ఖాతాల్లో పెట్టుబడిగా 1,07,09,000 రూపాయలను డిపాజిట్ చేయించుకున్నారన్నారు. అయితే ఆ తర్వాత వారి నుంచి ఎలాంటి స్పందన లేదని, దీంతో మోసపోయానని గుర్తించిన బాధితుడు ఫిర్యాదు చేశాడని గజానన్ వివరించారు.

### మోసపోతున్నాం ఇలా..

సైబర్ నేరగాళ్లు ఫలానా బ్యాంక్ లేదా దర్యాప్తు ఏజెన్సీల నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు. సీబీఐ, ఎన్ఐఏ, ఈడీ, ఆర్బీఐల అధికారులమంటూ అమాయకులను భయపెట్టి, నమ్మించి బురిడీ కొట్టిస్తున్నారు. తమ ఖాతాల్లోకి భారీగా నగదును బదిలీ చేసేసుకుంటున్నారని వివిధ కేసుల్లో దర్యాప్తు అధికారులు చెప్తున్నారు. కాగా, గత 4 నెలల్లో 3.25 లక్షల బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేసిన అధికారులు.. మరో 5.3 లక్షల సిమ్ కార్డులను బ్లాక్ చేశారు. 3,401 సోషల్ మీడియా అకౌంట్లనూ డీఆక్టివేట్ చేశారు. ఆగ్నేయాసియా దేశాల్లోని వివిధ ప్రాంతాలను కేంద్రంగా చేసుకొని భారత్‌ను సైబర్ మోసగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారని 14సీ సీఈవో రాజేశ్ కుమార్ తెలిపారు. వీటిలో కంబోడియా, థాయిలాండ్, మయన్మార్ దేశాలున్నట్టు చెప్పారు.

- *గత ఏడాది దేశవ్యాప్తంగా లక్షకుపైగా ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్ కేసులు నమోదు*
- *రోజూ మోసాలపై 7వేలకుపైగా వస్తున్న ఫిర్యాదులు. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా 7,40,957 కేసులు*
- *గత కొన్నేండ్లుగా పెరుగుతూపోతున్న డిజిటల్ మోసాలు. 2019లో 26,049గా ఉన్న కేసులు.. 2023లో 15,56,215కు చేరిక.*

## రిటైల్లోకి అపర్ణ

### 284 కోట్లతో హైదరాబాద్‌లో షాపింగ్ మాల్

హైదరాబాద్, మే 27: ప్రముఖ రియల్టీ సంస్థ అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్..తాజాగా రిటైల్-కమర్షియల్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలోకి అడుగుపెట్టింది. ఇందు కోసం రూ.284 కోట్లతో హైదరాబాద్‌లో అపర్ణ నియో షాపింగ్ మాల్, అపర్ణ సినిమాస్ పేర్లతో ప్రత్యేక వ్యాపారాన్ని ఆరంభించింది. నల్లగండ్ల వద్ద 3.67 ఎకరాల స్థలంలో 3.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో షాపింగ్ మాల్‌ను నెలకొల్పింది. వీటిలో రూ.252 కోట్లను అపర్ణ నియో షాపింగ్ మాల్ కోసం ఖర్చు చేసిన సంస్థ..మరో రూ.32 కోట్లతో అపర్ణ సినిమాస్‌ను తీర్చిదిద్దింది. అలాగే వ్యాపార విస్తరణలో భాగంగా 2027 నాటికి తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లలో నాలుగు మాల్స్‌ను నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం సంస్థ తెలంగాణతోపాటు ఏపీ, కర్ణాటకల్లో 77 ప్రాజెక్టులను నిర్మించింది. వీటిలో 66 రెసిడెన్షియల్ ప్రాపర్టీలు కాగా, మరో 11 కమర్షియల్ అండ్ రిటైల్ రంగానికి చెందినవి.



# సెన్సెక్స్ @ 76,000

- ఇంట్రా-డేలో తొలిసారి తాకిన సూచీ
- నిఫ్టీ సైతం ఆల్‌టైమ్ హైని చేరి దిగువకు పతనం
- స్వల్ప నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు
- లాభాల స్వీకరణకు దిగిన మదుపరులు



ముంబై, మే 27: తీవ్ర ఒడిదొడుకుల నడుమ దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం స్వల్ప నష్టాలను చవిచూశాయి. ఉదయం ఆరంభం నుంచే లాభాల్లో పరుగులు పెట్టిన సూచీలు.. మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలను చేరాయి. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ తొలిసారి 76,000 పాయింట్లను తాకింది. ఒకానొక దశలో 599.29 పాయింట్లు ఎగిసి గరిష్ఠంగా 76,009.68 వద్దకు వెళ్లి ఆల్‌టైమ్ ఇంట్రా-డే హైని నెలకొల్పింది. ఇదే సమయంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 153.70 పాయింట్లు ఎగబాకి 23,000 మార్కును మరోసారి అధిగమించి, మొదటిసారి 23,110.80 స్థాయిని టచ్ చేసింది. అయితే మదుపరులు ఒక్కసారిగా లాభాల స్వీకరణకు దిగారు. దీంతో సూచీలు క్రమేణా పడిపోతూ నష్టాలకు లోనయ్యాయి. చివరకు సెన్సెక్స్ 19.89 పాయింట్లు తగ్గి 75,390.50 వద్ద, నిఫ్టీ 24.65 పాయింట్లు దిగి 22,932.45 వద్ద స్థిరపడ్డాయి. ఇక సెన్సెక్స్ గరిష్ఠ స్థాయి నుంచి దాదాపు 835 పాయింట్లు క్షీణించగా, నిఫ్టీ 250 పాయింట్లు పతనమైంది. సెన్సెక్స్ కనిష్ఠ స్థాయి 75,175.27గా, నిఫ్టీ కనిష్ఠం 22,870గా ఉన్నది. కాగా, సెన్సెక్స్ తొలిసారి 75,000 మార్కును గత నెల ఏప్రిల్ 9న తాకింది. దీంతో గడిచిన 31 ట్రేడింగ్ రోజుల్లో 1,000 పాయింట్లు పెరిగినట్టైంది. అంతకుముందైతే 74,000 నుంచి 75,000 స్థాయికి 21 ట్రేడింగ్ సెషన్లే పట్టింది. ఇదిలావుంటే బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఐటీ, ఆయిల్, ఎనర్జీ, ఎఫ్ఎంసీజీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మార్కెట్ హెవీ వెయిట్ షేరైన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ షేర్ విలువ దాదాపు 1 శాతం తగ్గడం ఓవరాల్ ట్రేడింగ్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసినట్టు మెజారిటీ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఐటీసీ షేర్ల పతనం కూడా దెబ్బతీసింది. ఇక వచ్చే వారం (జూన్ 4న) లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఉండటంతో మదుపరులు ఒకింత భయాందోళనలకు గురవుతున్నారని, ఇందుకు మార్కెట్ ఒడిదొడుకులే తాజా ఉదాహరణ అని మరి కొందరు ఎక్స్‌పర్ట్స్ ట్రేడింగ్ సరళిని అభివర్ణిస్తున్నారు. సెన్సెక్స్‌లో విప్రో, ఎన్టీపీసీ, సన్ ఫార్మా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐటీసీ, ఆర్ఐఎల్ షేర్లు భారీగా నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలూ 0.63 శాతం, 0.09 శాతం చొప్పున క్షీణించాయి.

### తగ్గనున్న ఎన్ఎస్ఈ టిక్ సైజ్

రూ.250 కంటే తక్కువ ధర కలిగిన అన్ని స్టాక్స్‌కు ఒక పైసా టిక్ సైజ్‌ను పెట్టాలని ఎన్ఎస్ఈ నిర్ణయించింది. జూన్ 10 నుంచి ఈ మార్పు అమల్లోకి రానున్నది. ఇంతకుముందు ఇది 5 పైసలుగా ఉండేది. ద్రవ్యతను పెంచడం, ధర అన్వేషణను మెరుగుపర్చడంలో భాగంగానే ఆయా షేర్లకు టిక్ సైజ్‌ను తగ్గిస్తున్నట్టు ఎన్ఎస్ఈ ఓ సర్క్యులర్‌లో పేర్కొన్నది. టిక్ సైజ్‌లు అనేవి ప్రతీ నెల చేసే సర్దుబాట్లు, సమీక్షలకు లోబడి ఉంటాయి. ప్రతీ నెల చివరి ట్రేడింగ్ రోజు ముగింపు ధరలపై ఆధారపడి ఉంటాయి. గత ఏడాది బీఎస్ఈ కూడా రూ.100 కంటే తక్కువ ధర కలిగిన అన్ని స్టాక్స్‌కు టిక్ సైజ్‌ను 5 పైసల నుంచి 1 పైసాకు తగ్గించింది.

## ఎన్ఎండీసీ ప్రాఫిట్ డౌన్

న్యూఢిల్లీ, మే 27: ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామి సంస్థయైన ఎన్ఎండీసీ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చి త్రైమాసికానికిగాను రూ.1,415.62 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో నమోదైన రూ.2,276.94 కోట్ల లాభంతో పోలిస్తే 38 శాతం తగ్గింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ. 5,842.52 కోట్ల నుంచి రూ. 6,908.37 కోట్లకు ఎగబాకింది. నిర్వహణ ఖర్చులు పెరగడం వల్లనే లాభాల్లో గండి పడిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## ఆర్బీఐ డివిడెండ్ ప్రభావం పరిమితమే

### *ఫిచ్ రేటింగ్స్ అంచనా*

న్యూఢిల్లీ, మే 27: కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవల ప్రకటించిన డివిడెండ్ ప్రభావం.. ప్రభుత్వ రుణ భారం, లోటు తగ్గింపులపై పరిమితంగానే ఉండొచ్చని ప్రముఖ గ్లోబల్ రేటింగ్స్ ఏజెన్సీ ఫిచ్ రేటింగ్స్ అభిప్రాయపడింది. గత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్‌ను ఆర్బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. బడ్జెట్ అంచనా కన్నా ఇది రెట్టింపునకుపైగా ఉండటం గమనార్హం. కాగా, దేశ జీడీపీలో ఈ డివిడెండ్ 0.6 శాతానికి సమానమని ఫిచ్ తెలిపింది.

## ఎల్ఐసీ లాభం 13,763 కోట్లు

### జీతాల పెంపుతో లాభాల వృద్ధికి బ్రేక్

న్యూఢిల్లీ, మే 27: దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.13,763 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.13,428 కోట్ల లాభంతో పోలిస్తే కేవలం రెండు శాతం మాత్రమే పెరిగింది. ఉద్యోగుల వేతనాలు పెంచడం వల్లనే లాభాలు తగ్గుముఖం పట్టాయని ఎల్ఐసీ చైర్మన్ సిద్ధార్థ మోహంతీ తెలిపారు. నూతన ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయడంతో ఈ ఏడాది రెండంకెల వృద్ధిని సాధించే అవకాశాలున్నాయని మోహంతీ వెల్లడించారు. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.2,00,185 కోట్ల నుంచి రూ.2,50,923 కోట్లకు ఎగబాకినట్లు వెల్లడించింది. దీంట్లో తొలి ఏడాది ప్రీమియం వసూళ్లు(జనవరి-మార్చి మధ్య కాలంలో) రూ.12,811 కోట్ల నుంచి రూ.13,810 కోట్లకు చేరుకున్నాయి. అలాగే రెన్యూవల్ ప్రీమియం వసూళ్లు రూ.76 వేల కోట్ల నుంచి రూ.77,368 కోట్లకు పెరిగాయి.

- 2023-24కి గాను రూ.4,75,070 కోట్ల ఆదాయంపై రూ.40,676 కోట్ల నికర లాభాన్ని గడించింది.
- 2023-24కి గాను రూ.6 తుది డివిడెండ్‌ను ప్రకటించింది. గతంలో ప్రకటించిన రూ.4 మధ్యంతర డివిడెండ్ కలుపుకొని మొత్తంగా రూ.10 చెల్లించనున్నది.
- 2,03,92,973 పాలసీలను సంస్థ విక్రయించింది.
- కంపెనీ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ రూ.51,21,887 కోట్లకు చేరుకున్నాయి. ఏడాది క్రితం ఇవి 43,97,205 కోట్లు.

## దేశీయ ఫార్మాకు అమెరికా జోష్

న్యూఢిల్లీ, మే 27: ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) అమెరికా మార్కెట్ నుంచి భారతీయ ఔషధ రంగ సంస్థలకు పెద్ద ఎత్తున ఆదాయం సమకూరవచ్చని ఇండియా రేటింగ్స్ అండ్ రిసెర్చ్ సోమవారం అంచనా వేసింది. దేశీయ ఫార్మా కంపెనీలకు అమెరికా విపణి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే అక్కడ ఏర్పడిన ఔషధాల కొరత.. డాక్టర్ రెడ్డీస్, సిప్లా, సన్ ఫార్మా తదితర సంస్థలకు కలిసి రానుందని, వీటి ఉత్పత్తుల అమ్మకాలు పెరుగుతాయని ఇండియా రేటింగ్స్ అంటున్నది. దీంతో ఈ ఫార్మా సంస్థల రెవిన్యూ వృద్ధి ఈసారీ నిలకడగా కొనసాగగలదన్నది. అమెరికాలో ప్రస్తుతం ఔషధాల కొరత దశాబ్ద కాలం గరిష్ఠ స్థాయికి చేరింది. 22 థెరపిటిక్ కేటగిరీల్లో 233 ఔషధాల కొరత ఉన్నదని యూఎస్ఎఫ్‌డీఏ గణాంకాలు చెప్తున్నాయి.